## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం




**దశ, భద్రాద్రి:** భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ "ఢిల్లీలో జరిగిన పరిణామాల నేపథ్యంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులకు రాహుల్ గాంధీ మద్దతు ఇస్తున్నారని మేము భావిస్తున్నాం. దేశంలో అల్లర్లు, ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం కాంగ్రెస్ పార్టీకి కొత్త విషయం కాదని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది." అని అన్నారు. "ఈ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత. సమస్యలు ఉంటే పార్లమెంట్లో, చట్టసభల్లో చర్చించి ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కారం కనుగొనాలి. నిరసనల పేరుతో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించడం ఏమాత్రం సమర్థనీయం కాదు." అని పేర్కొన్నారు. అలాగే, "భారతీయ జనతా పార్టీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ప్రజాస్వామ్యబద్ధంగా దేశానికి సేవ చేస్తోంది. దేశ సమైక్యత, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది." అని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఇద్దరు దొంగలు అరెస్టు

**దశ, హైదరాబాద్:** బంజారాహిల్స్లో భారీ చోరీ కేసును టాస్క్ఫోర్స్, పోలీసులు ఛేదించారు. రాత్రివేళ ఇంటి చోరీకి పాల్పడిన ఇద్దరు సోదరులను అరెస్ట్ చేసారు. 1 కిలో 28.59 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు: సోంకాంబ్లే హరీష్ (29), సోంకాంబ్లే ఆకాష్ (25). హరీష్ ప్రైవేట్ జ్యువెలరీ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్గా పనిచేస్తూ చోరీకి ప్లాన్ వేసాడు. కంపెనీ లాకర్లో ఉన్న బంగారు ఆభరణాలపై ముందే నిఘా పెట్టాడు. జూలై 16న చోరీకి ప్రయత్నించి విఫలం అయ్యారు. జూలై 17న విద్యుత్ సరఫరా నిలిపివేసి, బాత్రూమ్ గ్రిల్ పగులగొట్టి కార్యాలయంలోకి ప్రవేశించారు. లాకర్లోని బంగారు ఆభరణాలను హరీష్ అపహరించాడు. దొంగిలించిన బంగారాన్ని సోదరుడు ఆకాష్ వద్ద దాచిపెట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడి అయింది.

## కేంద్ర మంత్రులను ఘెరావ్ చేస్తాం: జగ్గారెడ్డి



**దశ, సంగారెడ్డి:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కౌంటర్ ఇచ్చారు. బుధవారం రెండో రోజూ సంగారెడ్డి లో జగ్గారెడ్డి ఆధ్వర్యం లో ఆందోళనలు కొనసాగాయి. జగ్గారెడ్డి మాట్లాడుతూ పేపర్ లీకేజీ ఘటనపై రాహుల్ గాంధీ ప్రధాని మోడీ ఇంటి ముందు ధర్నా చేస్తే తప్పేంటి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గాంధీ భవన్ కి వచ్చి ఏం చేస్తారు. మీరు గాంధీ భవన్ కి వస్తే, మేము బిజెపి ఆఫీస్ ని ముట్టడిస్తాం. మీకు చేతనైతే ప్రధాని మోడీతో విద్యార్థులకు క్షమాపణ చెప్పించండి. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ని రాజీనామా చేయించండని అన్నారు. లేదంటే మిమ్మల్ని, కేంద్ర మంత్రులని ఘెరావ్ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం నీట్ విద్యార్థులకు కనీసం క్షమాపణ చెప్పలేదు. ప్రధాని మొండిగా వ్యవహరిస్తున్నారు...ప్రధాని బేషరతుగా క్షమాపణ చెప్పాలి. మతం, దేవుడి పేరుతో ఓట్లు తెచ్చుకున్న బీజేపీకి విద్యార్థుల సమస్యలు పట్టవని ఆరోపించారు.

## జర్నలిస్టుల సమస్యలపై 27న "ఛలో పార్లమెంట్"



**దశ, హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద "ఛలో పార్లమెంట్" పేరుతో ఒక రోజు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రకటించింది. హైదరాబాద్లోని ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ కార్యక్రమ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ల పునరుద్ధరణ, జర్నలిస్టుల రక్షణ చట్టం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించడం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు వంటి డిమాండ్లతో 27న జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. పాండురంగారావు, పి. అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా కోకన్వీనర్ నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు.

## అర్ధరాత్రి పాన్ షాపులు తెరిచిన ఇద్దరికి జైలు శిక్ష



**దశ, హయత్నగర్ :** అర్ధరాత్రి వేళల్లో నిబంధనలకు విరుద్ధంగా పాన్ షాపులు నిర్వహించి ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించిన ఇద్దరిపై హయత్నగర్ పోలీసులు చర్యలు చేపట్టారు. వారిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, ఇద్దరికీ రెండు రోజుల సాధారణ కారాగార శిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం, హయత్నగర్కు చెందిన గుడెల్లి యాకయ్య (40), సయ్యద్ ఇర్ఫాన్ (41) అర్ధరాత్రి సమయంలో పాన్ షాపులను తెరిచి ఉంచడంతో పాటు నేరస్థులు, అనుమానాస్పద వ్యక్తులు గుమిగూడే పరిస్థితులు కల్పించినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా హయత్నగర్ పోలీసులు హెచ్చరిస్తూ.. అర్ధరాత్రి వేళల్లో పాన్ షాపులు, టీ దుకాణాలు లేదా ఇతర వ్యాపార సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం, నేరస్థులు లేదా అనుమానాస్పద వ్యక్తులు గుమిగూడేలా అవకాశం కల్పించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అలాగే, వ్యాపారులు ప్రభుత్వం, పోలీసు శాఖ నిర్దేశించిన సమయాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కరీంనగర్ భారీ దోపిడీ కేసులో కీలక మలుపు

❖ *రూ.25 లక్షల నగదు, 54 తులాల బంగారం దోపిడీ.. హుజురాబాద్లో లభ్యమైన దొంగిలించిన బైక్లు.. 11 ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు*








**దశ, కరీంనగర్/హుజురాబాద్:** కరీంనగర్ నగరంలోని భగత్నగర్ చౌరస్తా సమీపంలో జరిగిన భారీ దోపిడీ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపగా, దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దోపిడీ అనంతరం దుండగులు అపహరించిన రెండు ద్విచక్ర వాహనాలు హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్పీ కాలువ సమీపంలో లభ్యమయ్యాయి. దీంతో పోలీసులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు.

బాధితుడు అజ్మత్ అలీ ఫిర్యాదు మేరకు బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఎనిమిది మంది దుండగులు ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులను డమ్మీ తుపాకులు, కత్తులతో బెదిరించి చేతులు, కాళ్లు కట్టి ఒక గదిలో బంధించారు. అనంతరం ఇంట్లోని బీరువాను తెరిచి సుమారు రూ.25 లక్షల నగదు, 54 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, మొబైల్ ఫోన్లతో పాటు ఇంటి వద్ద ఉన్న రెండు బైక్లను కూడా దోచుకెళ్లారు. దుండగులు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంత యాసలో మాట్లాడినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. ఇంటి వద్ద సీసీటీవీ కెమెరాలు పనిచేయకపోవడంతో దర్యాప్తుకు కొంత ఆటంకం ఏర్పడినప్పటికీ, పరిసర ప్రాంతాల్లోని వందలాది సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇంట్లో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్న విషయం ముందుగానే తెలిసి ఉండటంతో పరిచయస్తుల ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా విచారణ సాగుతోంది.

ఇదిలా ఉండగా, దొంగిలించిన రెండు బైక్లు హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామ శివారులో లభ్యమవడంతో పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. హుజురాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి, సీఐలు జి. కరుణాకర్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టగా, కరీంనగర్ నుంచి డీసీపీ వెంకటరమణ, సీఐ కోటేశ్వర్, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్లు కూడా దర్యాప్తులో పాల్గొన్నారు. దుండగులు స్థానికులా? లేక పోలీసులను తప్పుదారి పట్టించేందుకే బైక్లను అక్కడ వదిలివెళ్లారా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ మహ్మద్ గౌస్ ఆలం ఈ కేసును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 11 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. కరీంనగర్ నుంచి హుజురాబాద్ వరకు ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీలతో పాటు ఉప్పల్, జమ్మికుంట, బిజిగిరి షరీఫ్ రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లలోని సీసీటీవీ దృశ్యాలను కూడా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## మెడికవర్ ఆసుపత్రిలో మూవ్ మెంటమ్ పేరిట ఫిట్ నెస్ సెషన్



**దశ, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో "మూవ్మెంటమ్ 2026" పేరుతో 25 వేలకుపైగా విజయవంతమైన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన జుంబా ఫిట్నెస్ సెషన్లో రోగులు ఉత్సాహంగా పాల్గొని, శస్త్రచికిత్సల అనంతరం తిరిగి పొందిన ఆరోగ్యం, చురుకుదనం, ఆత్మవిశ్వాసాన్ని నృత్యాల రూపంలో ప్రదర్శించారు..చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ ఉదయ్ కృష్ణ ఆధ్వర్యంలో చికిత్స పొందిన వంద మంది రోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ జుంబా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన జుంబా ఫిట్నెస్ సెషన్లో రోగులు ఉత్సాహంగా పాల్గొని, శస్త్రచికిత్సల అనంతరం తిరిగి పొందిన ఆరోగ్యం, చురుకుదనం, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించారు.

కార్యక్రమంలో భాగంగా వెల్నెస్, పునరావాసం, క్రమం తప్పని వ్యాయామం ప్రాముఖ్యతపై చికిత్స నుండి కోరుకున్న రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. ఉదయ్ కృష్ణ మాట్లాడుతూ, విజయవంతమైన శస్త్రచికిత్స కంటే రోగులు నొప్పిలేని, చురుకైన జీవితాన్ని తిరిగి పొందడం చూడటమే వైద్యుడికి నిజమైన సంతృప్తి అని ఉదయ్ కృష్ణ అన్నారు. 25 వేలకుపైగా శస్త్రచికిత్సలు పూర్తి చేయడం రోగులు మాపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రోగులు తమ ఆరోగ్య పునరుద్ధరణ అనుభవాలను పంచుకుని వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.





## వర్షా భావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారుల సమీక్ష సమావేశం

**దశ, హయత్ నగర్ :** ఎల్ నీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండల కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు చేయాల్సిన పంటలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అనంతరం ఎంపీడీవో శ్రీవాణి గ్రామాల్లో వర్షపు నీటి సంరక్షణ చర్యలపై అన్ని శాఖల అధికారులతో చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంటికి ఇంకుడు గుంత, రైతుకు పంట కుంట, ఊరికి ఊట కుంట, బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు వంటి పనులను గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో గుంతలు తవ్వి విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి, మండల విద్యాశాఖ అధికారి, ఎంపీఓ, పంచాయతీరాజ్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈలు, పశుసంవర్ధక శాఖ వైద్యులు, ఐకేపీ ఏపీఎం, ఈజీఎస్ ఏపీఓ, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్స్ తదితరులు పాల్గొన్నారు.

## తపస్ మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ




**దశ, సూర్యాపేట ప్రతినిధి:** విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 1న హైదరాబాద్ లో తలపెట్టిన తపస్ మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు యామా రమేశ్, రాష్ట్ర సహాధ్యక్షులు పర్వతం సంధ్యారాణి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బుధవారం తపస్ జిల్లా కార్యాలయంలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ కు ముఖ్య అతిథిగా హాజరైన సంధ్యా రాణి మాట్లాడుతూ చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు, ఈ ధర్నాలో తపస్ మండల , జిల్లా, రాష్ట్ర బాధ్యులు, సభ్యులతో పాటు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి హరిప్రసాద్, జిల్లా కోశాధికారి సురభి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు మంచాల రవికుమార్ , బైరు తిరుమలేష్ ,జిల్లా కార్యదర్శులు నాగిరెడ్డి జితేందర్ రెడ్డి, బట్టిపల్లి సాయి కుమార్, రేపాల రజని, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి చిట్యాల ఉపేందర్, చివ్వెంల మండల అధ్యక్షులు కోట శ్రీనివాస్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మైనంపాటి కోటిరెడ్డి సూర్యాపేట మండల అధ్యక్షులు గడ్డం కృష్ణారెడ్డి, దుర్గరాజు పద్మజ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులపై లాఠీచార్జ్ అమానుషం

*ప్రశ్నించే గొంతుకలను అణచొద్దు: మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్రెడ్డి*

**దశ, మెదక్:** ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్రెడ్డి అన్నారు. ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను వినాలే తప్ప, బలప్రయోగంతో నిరసనలను అణచివేయకూడదని సూచించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పార్లమెంట్లో విద్యార్థుల సమస్యలు, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# "నేను సైతం"లో సీసీటీవీ జియో ట్యాగింగ్‌కు వేగం

❖ *సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ సమీక్ష*




**దశ, హైదరాబాద్:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్, పర్యవేక్షణ, నిర్వహణ, విస్తరణపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ బుధవారం సమీక్ష నిర్వహించారు. కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్రతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, దర్యాప్తులో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన అన్ని కెమెరాలకు జియో ట్యాగింగ్ పూర్తి చేసి వాటి వివరాలను డిజిటల్ డేటాబేస్లో నమోదు చేయాలని, కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కెమెరాకు వెంటనే జియో ట్యాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి పోలీస్ స్టేషన్లో సీసీటీవీ వ్యవస్థ పర్యవేక్షణకు ప్రత్యేక అడ్మిన్ను నియమించి కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, పనిచేయని కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించి పోలీస్ పర్యవేక్షణ వ్యవస్థతో అనుసంధానం చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో "నేను సైతం" కార్యక్రమం ద్వారా మరిన్ని సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. డీవీఆర్ (DVR) ఆధారిత పాత సీసీటీవీ వ్యవస్థలను దశలవారీగా ఆధునిక ఎన్వీఆర్ (NVR) సాంకేతికతకు అప్గ్రేడ్ చేయాలని సీపీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ల నుంచి సెంట్రల్ కంట్రోల్ సెంటర్ వరకు నెట్వర్క్ అనుసంధానాన్ని వేగవంతం చేసి ప్రత్యక్ష పర్యవేక్షణ, వీడియో రికార్డింగ్, ఫుటేజీ నిల్వ, ఆధారాల సేకరణ, విశ్లేషణను మరింత సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసిన వెండర్లు నిర్వహణ, సాంకేతిక లోపాల పరిష్కారం, సేవల నిరంతర అందుబాటుకు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

జియో ట్యాగింగ్, సాఫ్ట్‌వేర్ వినియోగం, కెమెరాల నిర్వహణపై అధికారులు, సిబ్బంది, వెండర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ సీసీటీవీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తే నేరాల నియంత్రణ, దర్యాప్తు సామర్థ్యం మరింత పెరుగుతుందని డా. ఎం. రమేష్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ వ్యవస్థతో అనుసంధానం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఆరుట్ల మహిళా సంఘాలకు బీఆర్ఆర్ ఫౌండేషన్ అండ..

❖ కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్ల పంపిణీ



**దశ, మంచాల :** సమాజ సేవలో భాగంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆరుట్ల గ్రామ డ్వాక్రా మహిళా సంఘాలకు అవసరమైన సామగ్రిని అందజేసింది. మహిళల సౌకర్యార్థం 60 కుర్చీలు, నాలుగు సీలింగ్ ఫ్యాన్లను ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పున్నం రాము మాట్లాడుతూ.. మహిళా సంఘాలు, గ్రామీణ పేదలు, విద్య, వైద్య అవసరాలు ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామ్ రెడ్డి సేవలను కొనియాడారు. సమాజంలో అవసరమైన వారికి భరోసాగా నిలుస్తున్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ సద్దాం, బి. వెంకటేష్, పోలమోని శ్రీకాంత్, ఎండీ షాకేర్, మహిళా సంఘాల ప్రతినిధులు ఏపీఎం శేఖర్ గౌడ్, సీసీ యాదగిరి, వీఓఏలు పల్లె రుద్ర, తలారి ప్రమీల, మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత, గ్రామ పెద్దలు ఆమంచ కృష్ణ, దాసరమోని శేఖర్తో పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఆరుట్ల గ్రామ డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు బీఆర్ఆర్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసన

❖ ఇబ్రహీంపట్నంలో మోదీ, అమిత్ షా దిష్టిబొమ్మల దహనం



**దశ, ఇబ్రహీంపట్నం:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకుల అరెస్టులను నిరసిస్తూ బుధవారం ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఢిల్లీ ఘటనపై ఓయూలో విద్యార్థుల ఆందోళన







❖ జంతర్‌మంతర్‌లో నిర్బంధ చర్యలను ఖండిస్తూ భారీ ర్యాలీ

❖ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్

**దశ, ఓయూ:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, ఉద్యమకారులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిర్బంధ చర్యలను ఖండిస్తూ విశ్వవిద్యాలయాల విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు వందలాది మంది విద్యార్థులు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన సభలో విద్యార్థి నాయకులు రవితేజ, నళిగంటి శరత్, డా. ఎస్. నాగేశ్వరరావు, ఆజాద్, స్వాతి, శరత్, ఉదయ్, మూర్తి, దర్శన్, సుమంత్, నవీన్, నాగరాజు, శ్రీధర్, చిరంజీవి, సతీష్ తదితరులు ప్రసంగించారు. విద్యార్థి ఉద్యమాలను అణచివేసే విధంగా కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జీలు, వాటర్ కానన్లు, టియర్ గ్యాస్ వంటి నిర్బంధ చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వక్తలు విమర్శించారు. దేశ యువత సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు అణచివేత విధానాలను అవలంబించడం సమంజసం కాదన్నారు. 2024లో జరిగిన NEET UG, UGCNET పరీక్షల పేపర్ లీకేజీలు దేశవ్యాప్తంగా ఆందోళనకు దారితీశాయని, అప్పుడే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుత పరిస్థితులు ఉత్పన్నమయ్యేవి కావని పేర్కొన్నారు.

**ప్రధాన డిమాండ్లు**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి. NEET పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. పరీక్షల నిర్వహణ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. రాష్ట్రాలకు స్వతంత్రంగా పరీక్షలు నిర్వహించే అధికారాన్ని కల్పించాలి. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి.

ఈ కార్యక్రమానికి మహిళా జేఏసీ, ట్రాన్స్‌జెండర్ సంఘాలు, వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, మేధావులు, ప్రొఫెసర్లు సంఘీభావం ప్రకటించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి: ఆర్టీఏ మెంబర్ సురేష్ లాల్



**దశ, ఓయూ:** జాతీయ స్థాయి పరీక్ష నీట్ లీకేజికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనీ ఆర్టీఏ మెంబర్ నేతికార్ సురేషాల్ డిమాండ్ చేశారు. లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులను నిరసిస్తూ బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో లోక్ భవన్ కార్యక్రమానికి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం లాలాపేట నుంచి సురేష్ లాల్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. అంతకంటే ముందుగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువకులపై లాఠీ చార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోఢీ మౌనం వీడాలన్నారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలన్నారు. గాయపడ్డ వారందికి ఉచితంగానే మెరుగైన వైద్యం అందించి అదుకోవాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాస్,సాయి, పురుషోత్తమ్,మల్లేష్ యాదవ్,రామ్ తదితరులున్నారు.

## అర్హులైన ప్రతి ఓటు జాబితాలో ఉండేలా చూడాలి



**దశ, సూర్యాపేట ప్రతినిధి** అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు జాబితాలో కొనసాగేందుకు కృషి చేయాల్సిన బాధ్యత బీఎల్ఓలు, బీఎల్ఏలపై ఉందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 26వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. నిజమైన అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా చూడాలని, అవసరమైన పత్రాలతో ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు.బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పాలగాని కృష్ణ, వల్దాస్ దేవేందర్, శ్రీనివాస్, ధర్మ నాయక్, బి ఎల్ వో లు శ్రీదేవి, వీరమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా బాధిత రైతులతో మంత్రి శ్రీధర్ బాబు సమావేశం

❖ సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.




**దశ, రంగారెడ్డి :** ఫార్మా ప్రాజెక్టు భూసేకరణలో భూములు ఇవ్వని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కురుమిద్ద గ్రామాలు, తండాల రైతులతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో ప్రతి గ్రామం నుంచి ఐదుగురు రైతులతో మంత్రి నేరుగా మాట్లాడించి వారి సమస్యలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వివరించారు.

గత ప్రభుత్వం రైతులతో చర్చించకుండా ఫార్మాసిటీ భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేసిందని, గ్రామాల్లోని పాఠశాలలు, దేవాలయాలు, నివాస గృహాలు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ భూములు కూడా నోటిఫికేషన్‌లో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని రైతులు మంత్రికి వివరించారు.

నానక్‌నగర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, తాటిపర్తి మాజీ సర్పంచ్ దూస రమేష్, రైతులు దార చెన్నయ్య, సోమయ్య మాట్లాడుతూ గ్రామాలకు రెవెన్యూ భూమి మిగిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కురుమిద్ద మాజీ సర్పంచ్ బందే రాజశేఖర్ రెడ్డి గ్రామాల సమీపంలోని భూములను రైతుల వద్దే ఉంచేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు వినోద్, దేవోజీ, శ్రీకాంత్, కనమోని గణేష్, మైపాల్ రెడ్డి, సందీప్ రెడ్డి, సామ నిరంజన్, దార సత్యం తదితరులు రోడ్లు, బుల్లెట్ ట్రైన్ మార్కింగ్‌లతో ఎదురవుతున్న ఇబ్బందులు, నష్టపరిహారం, ప్రత్యామ్నాయ భూముల అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కందుకూరు రెవెన్యూ గ్రామాల మాదిరిగానే నష్టపరిహారం ఇవ్వాలని కూడా కోరారు.

సుమారు రెండు గంటలపాటు రైతుల సమస్యలు విన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం సానుకూలంగా ఆలోచిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రతి రైతుతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపేందుకు అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డికి ఆదేశించారు. త్వరలో మరోసారి రైతులతో సమావేశం నిర్వహించి పరిష్కార మార్గాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫార్మా బాధిత రైతులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## మహాకవి దాశరధి ఆశయాలు సాధిద్దాం: తాటికొండ సీతయ్య



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రపంచానికి చాటిచెప్పిన మహాకవి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దాశరధి కృష్ణమాచార్య ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య పిలుపునిచ్చారు. మహాకవి దాశరధి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా తుంగతుర్తి మండల పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరధి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాటికొండ సీతయ్య మాట్లాడుతూ, "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ ఆత్మను ప్రపంచానికి చాటిన మహాకవి దాశరధి రచనలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడిగా దాశరధి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మండల నాయకులు గోపగాని రమేష్, నల్లబెల్లి వెంకటేష్, బొంకూరి మల్లేష్, సాయికుమార్, సురేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుపై కదంతొక్కిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు







❖ విద్యార్థులపై లాఠీ ఛార్జ్,కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్..

❖ గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ..

**దశ, హుజురాబాద్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేపర్‌లీకులు చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటుందని, శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేసి, విద్యార్థులకు మద్దతుగా లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనీ అరెస్ట్ చేయడం దుర్మార్గమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం రోజున కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని గాంధీనగర్ కార్ఖానా గడ్డ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమానికి మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,గ్రంథాలయ చైర్మెన్ సత్తు మల్లేశం,సుడా మాజీ చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,నగర అధ్యక్షుడు అంజన్ కుమార్,కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి యువత ప్రధాన బలమని చెప్పిన ప్రధాని మోదీ ఆ యువతపై దాడి చేయించడం సమంజసంకాదని,వారి పక్షాన కొట్లాడుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు.భేషరతుగా నీట్ ఎగ్జామ్ పేపర్ లేకు సంబంధించి వ్యవహారంపై పార్లమెంట్ లో చర్చ జరగాలని,విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అన్నారు.అనంతరం గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీయగా,పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని బీజేపీ అవలంభిస్తున్న తీరుపై వ్యతిరేక నినాదాలు చేశారు. స్థానికంగా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఈ విషయంపై పార్లమెంట్ లో చర్చ జరపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.